క్లుప్తంగా

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



మహా పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవిశ్వకర్మ శివాలయంలో మూడురోజుల నుంచి నిర్వహిస్తున్న ఆలయ ద్విపుష్కర ప్రయుక్త వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం మహా కుంభాభిషేకంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ ముత్తోజు వీర బ్రహ్మాచార్యస్వాములు, ఆలయ అర్చకులు మారుపాక శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. సహస్ర కలశాలతో మహాకుంభాభిషేకం చేసి ఆలయ శిఖర సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగులమల్యాల రాజమౌళి ఆచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి



ధర్నా చేస్తున్న టీయూసీఐ నాయకులు

జ్యోతినగర్: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర మహాసభ పిలుపులో భాగంగా గురువారం గోదావరిఖని సహాయ కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టీయూసీఐ ప్రతినిధులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26 చెల్లించాలని డిమాండ్ చేశారు. టీయూసీఐ జిల్లా గౌరవ అధ్యక్షుడు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు తోకల రమేశ్, జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడు ఆడెపు శంకర్, పి.నాగభూషణం ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటాలి



జెండా ఎగురవేస్తున్న నాయకులు

ధర్మారం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించడానికి పార్టీ శ్రేణులు ఐకమత్యంతో కృషి చేయాలని మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి కోరారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపు మేరకు పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ ఆధ్వర్యంలో మండలంలోని గోపాల్‌రావుపేట, సాయంపేట గ్రామాల్లో పార్టీ సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించారు. పత్తిపాక సింగిల్ విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఆవుల వెణుగోపాల్, కాంపెల్లి అపర్ణ, సంధ్య మమత, ఈర్ల అనిత పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి

మంథని: టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్ష హాజరయ్యే యువ న్యాయవాదులకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంథని బార్ అసోసియేషన్‌లో శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, సింగరేణి సంస్థ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ రమణకుమార్‌రెడ్డి, లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ బండ మాధురి, న్యాయవాదులు విజయ్‌కుమార్, ఆర్ల నాగరాజు, శశిభూషణ్ కాచే, షబానా, వ్యాస్‌కుమార్ ఉన్నారు.

పెద్దంపేటలో వనమహోత్సవం



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో గురువారం వన మహోత్సవంలో భాగంగా ఎక్సైజ్ అధికారులు, కాంగ్రెస్ ప్రతినిధులు, గౌడ సంఘం ప్రతినిధులు సంయుక్తంగా ఖర్జూర మొక్కలు నాటారు. ఎక్సైజ్ ఎస్సై మంద శ్రీనివాస్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రతినిధి సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు మేర్గు కుమార్‌గౌడ్, బైరి సురేశ్‌గౌడ్, పల్లెర్ల శ్రీనివాస్, బండి విజయ్‌గౌడ్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పానగంటి రాజయ్య పాల్గొన్నారు.

‘ఎల్లంపల్లి’కి గుర్తింపేది..?

- సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్నా..
  ప్రారంభోత్సవానికి నోచుకోని ప్రాజెక్టు



శిలాఫలకానికి నోచుకోని ఎల్లంపల్లి పైలాన్



ఎల్లంపల్లి ప్రాజెక్టు

రామగుండం: జలయజ్ఞంలో భాగంగా జన హృదయ నేత దివంగత ఉమ్మడి రాష్ట్ర సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి శ్రీపాద(ఎల్లంపల్లి) ప్రాజెక్టుకు జూలై 28, 2004లో అంతర్గాం మండలం ఎల్లంపల్లి గ్రామ భూముల్లో శంకుస్థాపన చేశారు. తాగు, సాగు, పారిశ్రామిక అవసరాల నిమిత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2,744 కోట్లు జలయజ్ఞం కింద కేటాయించారు. మొదటి స్టేజీలో ఫేజ్–1, ఫేజ్–2గా విభజిస్తూ ఫేజ్–1లో ప్రాజెక్టు(డ్యాం) నిర్మాణం, ఫేజ్–2లో 6.5 టీఎంసీల నీటిని ఎన్టీపీసీకి పైపులైన్లతో నీటి సరఫరా చేయడం. 15 ఏళ్ల క్రితం నుంచి పూర్తి స్థాయి వినియోగంలోకి రాగా ప్రాజెక్టు సామర్థ్యం మేరకు నీటి నిల్వతో పాటు నీటి కేటాయింపులను ప్రారంభించారు.

ప్రారంభోత్సవానికి నోచుకోక..

15ఏళ్లుగా సాగు, తాగునీటి అవసరాలను తీర్చుతున్న ఎల్లంపల్లి ప్రాజెక్టుకు అధికారికంగా గుర్తింపు దక్కలేదు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా తమ హయాంలో నిర్మాణాన్ని తలపెట్టిన ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేయాలనే ఆలోచన రాకపోవడం శోచనీయం. ఈ నెల 3న నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఎత్తిపోతలను ప్రారంభించనున్న నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు ఇప్పటికైనా ఎల్లంపల్లి ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎంతోనే శంకుస్థాపన, ప్రారంభోత్సవం



ఎల్లంపల్లి ప్రాజెక్టును అట్టహాసంగా ప్రారంభించాం. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించాం. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులతోనే ప్రజలకు మనుగడ. ఎల్లంపల్లి ప్రాజెక్టు, రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రానికి రెండు కార్యక్రమాలు ఒకే రోజు ఒకటి ప్రారంభోత్సవం, మరొకటి శంకుస్థాపన సీఎంతో చేసేందుకు నిర్ణయించాం. త్వరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తాం.

– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం



రామగుండం: ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన అక్బర్‌నగర్‌లోని తాగునీటి కుళాయిని పశువులు తాకుతూ వెళ్లడంతో అడుగు భాగంలో విరిగిపోవడంతో తాగునీరు పూర్తిగా వృథాగా పోతోంది. పైపులైన్ అడుగు భాగంలో పగిలిపోవడంతో మరో చోట కుళాయిల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదు. ఇదిలా ఉండగా ఇటీవల అక్బర్‌నగర్ కార్పొరేషన్‌లో విలీనం కావడంతో పైపులైన్ పునరుద్ధరణపై ఎన్టీపీసీ, కుందనపల్లి గ్రామ పంచాయతీ అధికారుల్లో ఎవరు స్పందిస్తారో.. తాగునీటి పైపులైన్ పునరుద్ధరణకు ఎవరితో మోక్షం కలుగుతుందో చూడాలి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

బయట చెత్త పడేసిన ఆరుగురికి జరిమానా



జరిమానా విధిస్తున్న అధికారులు

కోల్‌సిటీ: నగరంలో బయట చెత్త పడేసిన దుకాణదారులకు నగరపాలక సంస్థ అధికారులు జరిమానా విధించారు. గోదావరిఖనిలోని పైవింక్లయిన్ చౌరస్తా సమీపంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఊడ్చి వెళ్లిన తర్వాత, సమీపంలోని ఆరు దుకాణాల యజమానులు చెత్త బయట పడేయడాన్ని బల్దియా కమిషనర్ జె.అరుణశ్రీ గురువారం గుర్తించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆరుగురు షాపు యజమానులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున జరిమానా విధించారు. చెత్త బయట పడవేయకుండా తడి, పొడి చెత్తగా వేరు చేసి వేర్వేరు డబ్బాల్లో వేసి మున్సిపల్ వాహనాలకు అందించి సహకరించాలని కోరారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్థానిక పవర్‌హౌస్ కాలనీలో పిచ్చిచెట్లు, పొదలు తొలగించారు. రఘుపతిరావు నగర్‌లో వాల్ పెయింటింగ్స్ వేశారు. గాంధీనగర్‌లో శిథిలావస్థలో ఉన్న కట్టడాలను టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో తొలగించారు. మరికొన్నింటికీ ఖాళీ చేయాలని హెచ్చరిక నోటీసులు అంటించారు. వేర్వేరుగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో టీపీవో నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్, జవాన్లు సుగుణాకర్, యూసఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అడ్మిన్ డీసీపీగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రాజు దంపతులను గురువారం సన్మానించారు. కమిషనరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన రాజును సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. అలాగే ఎస్‌ఐగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎన్.నరేశ్‌బాబు, ఆర్‌ఎస్‌ఐ జె.సమ్మయ్యను సన్మానించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, 13వ బెటాలియన్ కమాండెంట్ మూర్తి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, ఆర్‌ఐలు దామోదర్, మల్లేశం, శ్రీనివాస్, వామనమూర్తి పాల్గొన్నారు.

పనిగంటల పెంపు జీవో రద్దు చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పని గంటల పెంపు జీవో 282ను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ బంగ్లాస్ ఏరియాలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే 282 జీవోను రద్దు చేసి కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఐఎఫ్‌టీయూ నాయకులు దుర్గేష్, రాజబాబు, దుర్గం బాబు, చంద్రగిరి, శంకరమ్మ, సుభద్ర, లక్ష్మీ, నాగేష్, రాజయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వాహనాలు నడపొద్దు

ఓదెల: ప్రయివేట్ స్కూలు బస్సులను కండిషన్‌తో నడపాలని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ప్రయివేట్ స్కూలు బస్సుల డ్రైవర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. అనుమతి లేకుండా వాహనాలు నడపొద్దని, మద్యం తాగి వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



సన్మానిస్తున్న అధికారులు

సుల్తానాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు ప్రతీ ఒక్కరికి విరమణ తప్పనిసరి అని పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్ బాబు, ఎస్ఈ చక్రవర్తి ఉన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ డీఈ దేవేందర్ ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ఆయనను సన్మానించారు. ఏఈలు సచిన్, రాజమౌళి, మాజీ ప్రజాప్రతినిధులు మోరపల్లి మోహన్‌రెడ్డి, అరుణ్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల ఐకేపీ ఏపీఎంగా పనిచేసిన సంపత్‌ను ఓదెల మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని స్వశక్తి సంఘాల సభ్యులు గురువారం ఏపీఎం సంపత్‌కు సన్మాన సభ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, టాస్క్‌సెంటర్ ఇన్‌చార్జి కౌసల్య ఆయనను సత్కరించారు. మధుకర్, అనాసి శ్రీనివాస్ ఉన్నారు.

• టీసెర్ప్ ఏపీఎం బదిలీ

ఎలిగేడు: మండల కేంద్రంలోని టీసెర్ప్ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌ను జూలపల్లి మండలానికి బదిలీ చేశారు. సుల్తానాబాద్ ఏపీఎంగా ఉన్న గీత ఎలిగేడుకు బదిలీ అయినట్లు సుధాకర్ తెలిపారు. ఎలిగేడు అభ్యుదయ మండల టీసెర్ప్ కార్యాలయంలో సుధాకర్‌ను సన్మానించారు. డీపీఎం రవికుమార్, సీసీలు మల్లేశం, గీస ఆనంద్, జ్యోతి, కంప్యూటర్ ఆపరేటర్ పాల్గొన్నారు.

• ఓదెల ఏపీఎం బదిలీ

ఓదెల: ఓదెల ఐకేపీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీఎం లతమంగేశ్వరీ తొమ్మిదేళ్ల తర్వాత కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఏపీఎంను గురువారం మహిళా స్వశక్తి సంఘాలు, సీసీ, సీఏలు సన్మానించాయి. రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షులు కావటి రాజు ఆధ్వర్యంలో ఏపీఎంను సన్మానించారు.

• రవాణాశాఖ సేవలపై అవగాహన

మంథని: రవాణాశాఖ సేవలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆర్టీఏ జిల్లా సభ్యుడు మంథని సురేశ్ తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో వినియోగిస్తున్న వాహనాల తనిఖీపై అవగాహన కల్పిస్తామన్నారు.

• అవగాహన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి

గోదావరిఖని: కాలుష్య నియంత్రణ తీరుపై ప్రధాన కూడళ్లలో అవగాహన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని బెస్ట్ ఫర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ కోరారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ రవి గగ్లోత్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని రంగంపల్లి (చీకురాయిరోడ్) సెయింట్ ఆన్స్ స్కూల్, ఇండేన్ గ్యాస్ గోదాం, బీసీ హాస్టల్ ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు సరిచేస్తున్న కారణంగా ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

• వెలుగు సమాఖ్య ఏపీఎంకు సన్మానం

జూలపల్లి: మండల కేంద్రంలోని వెలుగు దీప్తి మండల సమాఖ్య ఏపీఎంగా విధులు నిర్వహించిన పద్మ బదిలీ కావడంతో గురువారం స్థానిక కార్యాలయంలో సన్మానించారు. జూలపల్లి నుంచి కమాన్‌పూర్ మండలానికి బదిలీ అయ్యారు. కాగా ఇక్కడ గతంలో ఇన్‌చార్జి ఏపీఎంగా పనిచేసిన ఎలిగేడు ఏపీఎం సుధాకర్ బదిలీపై జూలపల్లికి బదిలీ అయ్యారు. సీసీలు శ్రీధర్ మల్లేశం, జ్యోతి, ఆపరేటర్ మహేందర్ ఉన్నారు.

• పారదర్శకంగా భూసమస్యల పరిష్కారం

జూలపల్లి: భూభారతి గ్రామసభల్లో భూసమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను రైతుల సమక్షంలో విచారించి పరిష్కరించనున్నట్లు తహసీల్దారు స్వర్ణ తెలిపారు. మండలంలోని పెద్దాపూర్‌లో గురువారం ఆర్ఐ భవానీ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది గత గ్రామసభల్లో సమర్పించిన దరఖాస్తులపై రైతుల ఇళ్లకు వెళ్లడంతో పాటు భూమి వద్ద పక్కనున్న రైతులను విచారించి వివరాలు సేకరించారు.

• ప్రభుత్వ ఉపాధ్యాయుడికి సన్మానం

గోదావరిఖనిటౌన్: స్థానిక విఠల్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 36ఏళ్లుగా మ్యాథ్స్ టీచర్‌గా పాఠాలు బోధించిన చేరాల మనోహర్ గురువారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సమ్మయ్య, ఉపాధ్యాయులు బి.సతీశ్ బాబు, వి.శ్రీనివాస్, సరళకుమార్, రాజేశ్వరి, సరిత, జ్యోత్స్నరాణి, రాజేశ్వరి, సుభాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

• ఆరెంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

మంథనిరూరల్: మండలంలోని ఆరెంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జొన్నలగడ్డ పార్థసారథిని గురువారం పాఠశాలలో సన్మానించారు. ఆరెంద కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, హెచ్‌ఎం సుజాత, సీఆర్పీ మల్లయ్య, ఉపాధ్యాయులు సువర్ణ, గియాజు, పద్మజ, మమత, శ్రీవాణి, ప్రమీల పాల్గొన్నారు.

• ఉద్యోగ విరమణ సన్మానం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో బొంగోని శంకరయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం కనుకులలో నిర్వహించారు. అలాగే గర్రెపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసిన సాంబయ్య ఉద్యోగ విరమణ పొందగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

• మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం

మంథని: మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్‌రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులను గురువారం పలువురు సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మాజీ వైస్ ఎంపీపీ ఊదరి శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, నాయకులు దాడి క్రాంతికుమార్, రాపెల్లి సమ్మయ్య, అట్టెం వినయ్, దొరగార్ల శ్రీనివాస్, మంథని శ్రీనివాస్, సాగర్ పాల్గొన్నారు.

• సాయిబాబా ఆలయంలో పూజలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ గౌతమినగర్‌లోని సాయిబాబా ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది.

జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

మంథని: మంథని మున్సిపాలిటీలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభలు ఈ 17న నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సభలకు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. గడిపెల్లి మల్లేశ్, చిప్పకుర్తి సది, సింగారపు గట్టయ్య, బెజ్జాల అనిల్, జంపయ్య, అశోక్, రాజేశ్ ఉన్నారు.

2న జిల్లాస్థాయి జావెలిన్ త్రో పోటీలు

సుల్తానాబాద్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జావెలిన్ త్రో పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా సెక్రటరీ కె.గట్టయ్య ప్రకటనలో తెలిపారు. 12– 20 ఏళ్ల వయస్సుగల బాల, బాలికలు, మహిళలు, పురుషులకు పోటీల్లో పాల్గొనవచ్చని, ప్రతిభచూపిన 25 మందిని జనగామలో జరిగే రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనేవారు వయసు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9 గంటలకు క్రీడా ప్రాంగణానికి హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96183 36976 నంబర్‌ను సంప్రదించాలని, ఎంట్రీ ఫీజు రూ.వంద చెల్లించాలని పేర్కొన్నారు.

ఆయురారోగ్యాలతో జీవించాలి



ఉద్యోగుల కుటుంబ సభ్యులతో ఈడీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న వారితో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత మొక్కలు నాటించారు. గురువారం పీటీఎస్‌లోని పార్కులో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందుతున్న మహేందర్‌రెడ్డి, మేరాజ్ అహ్మద్, కేవీ స్వామి, సీహెచ్.రాజ్‌కుమార్, బానేశ్వర్ రావు, ఎం.వెంకటరెడ్డి, బీఎస్ఎన్ రావు, ఎ.రాజయ్య కుటుంబసభ్యులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి విరమణ పొందుతారని, వారు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కష్ణయ్య, జనరల్ సెక్రటరీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

కార్మికుల క్వార్టర్లకు మరమ్మతు చేయించాలి



వినతిపత్రం ఇస్తున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: క్వార్టర్ల పైకప్పు పెచ్చులూడి కార్మికులు గాయపడుతున్నారని, వెంటనే మరమ్మతు చేయించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీలోని క్వార్టర్లలో ఉంటున్న కార్మికులు భయాందోళన మధ్య కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు. ఇంటి పైకప్పు పెచ్చులూడి విశ్రాంతి తీసుకుంటున్న కార్మికుల మీద పడి గాయాలపాలయ్యాయన్నారు. వర్షం పడితే పైకప్పు నుంచి ఇంట్లోకి నీరు వస్తోందన్నారు. క్వార్టర్ల మరమ్మతు, నీటి సౌకర్యం గురించి ఫిర్యాదు చేసినా సివిల్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు కుంట ప్రవీణ్‌కుమార్, ఎస్.వెంకన్న, సంపత్‌కుమార్, రాంసాగర్, రాంప్రసాద్, సారంగం, సాంబారావు, సంపత్ ఉన్నారు.

సంక్షేమ అధికారులు అంకితభావంతో పనిచేయాలి

రామగిరి: ఉద్యోగుల సంక్షేమంపై సంక్షేమాధికారులు అంకిత భావంతో పనిచేయాలని ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. జీఎం కార్యాలయంలో ఏపీఏ గని సంక్షేమాధికారి, ఏరియా పర్సనల్ విభాగం అధికారులతో సంక్షేమ కార్యక్రమాలపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ సంక్షేమానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సర్వీసు విషయాలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు అందించారు. పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివైపీఎం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పీవోలు పి.రాజేశం, ఎల్.రవిచంద్ర, సంక్షేమ అధికారి మధు పాల్గొన్నారు.

సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డు రెన్యువల్ చేసుకోండి

గోదావరిఖని: సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డు రెన్యువల్ చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య ఒక ప్రకటనలో కోరారు. స్కీం కింద వైద్యసాయం పొందాలంటే సకాలంలో ఆన్‌లైన్ ద్వారా లైవ్ సర్టిఫికెట్స్ నమోదు చేసుకోవాలన్నారు. ఏరియాలో 3,381 మెడికల్ కార్డ్స్ ఉన్నాయని ఇందులో 2559 మంది ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా లైవ్ సర్టిఫికెట్స్ నమోదు చేసుకున్నారన్నారు. మెడికల్ కార్డ్‌పై వైద్య సాయం పొందాలంటే భార్యభర్తలు లైవ్ సర్టిఫికెట్ నమోదు చేసుకోవాలని సూచించారు.

సింగరేణి రక్షణకు దశలవారీగా ఆందోళనలు

రామగిరి: సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం బీఎంఎస్ దశల వారీగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. మండలంలోని సెంటినరీకాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ ఆందోళనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ పిన్నమనేని వేణుగోపాల్‌రావు, ఏరియా ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్, బ్రాంచ్ కార్యదర్శి రౌతు రమేశ్, సంయుక్త కార్యదర్శి విద్యాసాగర్, పిట్ కార్యదర్శి కృష్ణ, మంత్రి సంతోష్, నాయకులు జానీ, కందుల భీమరి మహేశ్, మినుగు సంతోష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నక్కల వాగుపై కల్వర్టు నిర్మాణం.. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



నక్కల వాగుపై కల్వర్టు నిర్మాణం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల నుంచి పోచంపల్లికి వేళ్లే దారిలో నక్కల వాగుపై అస్తవ్యస్తంగా ఉన్న కల్వర్టును ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మరమ్మతు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నక్కల వాగు పొంగి నీరు ప్రవహించడంతో మహిళా కూలీలు వాగు దాటడానికి ఇబ్బంది పడడంతో గ్రామస్తులు వాళ్లను తాళ్లతో రక్షించిన విషయం తెలిసిందే. ఈ విషయమై మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజవేన సదయ్య నక్కల వాగును ఇటీవల పరిశీలించారు. ఈ విషయాన్ని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి నక్కల వాగుపై శాశ్వత ప్రాతిపదికన పైపులు వేయించి, మొరం పోయించి రహదారిని బాగు చేయించారు. ఎమ్మెల్యేకు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌కు రెండు గ్రామాల ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీపీసీ పీటీఎస్‌లో కొరవడిన నిఘా!

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ 24 గంటలు నిఘాలో ఉంటుంది. అయినా వలస కార్మికుడి హత్య జరగడం, మృతుడిని ట్రాక్టర్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం వంటి విషయాలు సెక్యూరిటీ విభాగానికి తెలియకపోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన వలస కార్మికుడు వినోద్ బుబాజి(44)ని తోటి కార్మికుడు ఇనుప రాడ్‌తో హత్య చేయడం, ఆ తదుపరి వినోద్ బతికి ఉన్నాడని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకపోవడంపై పలువురు చర్చించుకుంటున్నారు. ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లో నిర్మిస్తున్న బహుళ అంతస్తు భవనం నిర్మాణంలో పనులు చేస్తున్న ఇతర రాష్ట్రానికి చెందిన కార్మికులకు భద్రతా చర్యలు లేకపోవడం, అక్కడ ఇరువురి మధ్య జరిగిన గొడవలో ఒక ప్రాణం బలి కావడం విషాదకరం. రాత్రి సమయంలో సరైన గస్తీ చేయకపోవడంతో వలస కార్మికుడి హత్య జరిగిన ఆరు గంటలైనా సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందలేదు.